

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపంరంజిల్లాలి!
ముజ్జగాలు సాయిమహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో ప్రతిధ్వనించాలి! ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటిదైవంబు లేడోయి! లేడోయి!! అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాధుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చేయవలసింది.

-- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో




| | | | | |
|---|---|---|---|---|
| 1. | సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!! | శ్రీ బాబూజీ | --- | 2 |
| 2. | ఉన్నమాట - అనుకున్న మాట | గురుబంధువులు | --- | 3 |
| 3. | బాబూజీని అడిగా - బాబు పుట్టాడు | ఓ. పెదరామయ్య | --- | 5 |
| 4. | దేశకాలపరిమితులకు అతీతం - గురుకృప | వినోద్ | --- | 6 |
| 5. | నాకోసమే ఇలా చేసారు గురువుగారు | రామకృష్ణ | --- | 7 |
| 6. | చిన్నమనసు - పెద్దహృదయం | రత్తయ్య | --- | 8 |
| 7. | ఆనందదాయకం - సాయిపథం | సి.హెచ్.సుష్మ | --- | 9 |
| 8. | సాయిపథం | కె. లక్ష్మీకుమార్ | --- | 11 |
| 9. | అవసరమైనవేళ నీవడగవలసిన పనిలేదు | పి. దేవి | --- | 12 |
| 10. | గురువుగారు, బాబాగారు కరుణించారు | పి. సూర్యనారాయణ | --- | 14 |
| 11. | పాపప్రాణాలు కాపాడిన గురుదేవులు | కె. చంద్రశేఖర రెడ్డి | --- | 15 |
| 12. | ఆపరేషన్ ఆపింది గురువే | హృషీకేశవరావు | --- | 16 |
| 13. | ఆచేయి ఎంత హాయి | డా॥ ఎస్. సాయివరప్రసాదరావు | --- | 17 |
| 14. | మహనీయుల - మహితోక్తులు | గురుచరణదాసుడు | --- | 19 |





శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!
సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!!

# గురుకృప

సంపుటి 5 | సంచిక 4 | త్రైమాసిక పత్రిక | అక్టోబర్ 2002

**నిర్వహణ**
గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

**చిరునామా**
గురుకృప
22-1-50
గాంధీచౌక్
తెనాలి - 01

08644
27194 (O)
31808 (R)

## ఉన్నమాట - అనుకున్నమాట

సాయిభక్తులకు, గురుబంధువులకు చిత్రభానునామ సంవత్సరంలో 'గురుకృప' పత్రిక మరింతగా సింగారించుకొని దసరా శుభాకాంక్షలను తెలియజేయుచు, "గురుకృప" సర్వులకు సమానంగా అందాలని ఆశిస్తున్నది.

సద్గురుని వచనాలు నోటినుండి రాలుతున్న నవమౌక్తికాలు. శిష్యుడు వాటిని ఏర్చి, కూర్చి, ఒకచోటికి చేర్చి దండగా గుచ్ఛకపోతే అవి నేలపాలు. అల్లిన దండను భద్రపర్చు అవసరానికి, ఆధిక్యతకుకాక. ఆర్తితో అలమటించు ఆర్తులకు దాని విలువను వివరించు. దాని సొగసును తగిన సమయంలో కొనియాడు. దాని ఆవశ్యకత అప్పడందరికి అర్థమైతీరుతుంది. నకనకమని ఆకలైన వానికి పచ్చడి మెతుకులే పంచభక్ష్యపరమాన్నములతో సమానంలా. అజీర్తి గలవానికి షడ్రశోపేతమైన భోజనంసైతం అరుచిని కలిగించును. ఇలా మనం చెప్పే విషయాలు ఎదుటివారికి అరుచిని కలిగించకూడదు.

సద్గురుని దివ్యలీలలే గురుదాసుల గాథలు. భాగవతభక్తుల దివ్యచరితను శ్రవణానందకరముగా వినేవారికి యంత్ర, మంత్రములతో పనేలేదు. తమస్సును దూరంచేయలేని తపస్సెందుకు? మనోమాలిన్యాన్ని కడిగి వేయలేని ఆత్మబలజల మెందుకు? అడ్డదిడ్డమైన భావాలను దట్టించుకొన్నవాడు





ఋజుమార్గమునందు ప్రయాణమును సాగించలేడు, చివరిమజిలీని చేరబోడు. నోటితో గురునామాన్ని పల్కుతు, నొసలుతో వెక్కిరించే వానికి గురునామములోని మాధుర్యం తెలియదు సరికదా! గమ్యాన్ని చేరలేడేమో!

తెడ్డుతాకిడి తగలందే నది దారీయదు - పడవలో ప్రయాణించేప్పడు. ఉలి దెబ్బలు తగలందే - రాయి శిల్పంగా మారదు. కష్టానికోర్చలేనివాడు భాగవతోత్తముడు కాలేడు. సంపాదన లేనినాడు భర్తను గౌరవించి ప్రేమించినదే నిజమైన భార్య. కష్టాల్లో ఉన్నప్పడు యజమానిని వదలని వాడే నిజమైన బంటు. **కోర్కెలతో నిమిత్తం లేకుండా శరణాగతిలో మార్పులేని వాడే నిజమైన "సాధకుడు".**

**సాధకుడనేవాడు** సాటి వారిని ప్రేమించాలనే నియతి ఉన్నప్పడు తనసాటి గురుబంధువులకు ఎలాంటి కష్టాన్ని తానుగా కల్గించరాదు. హింసించడమంటే జీవాలను హింసించేదే హింసకాదు. కాయికంగాగాని, మానసికంగాగాని, వాచకంగాగాని జీవులను హింసించరాదు. గురువుగారు ఎన్నో పర్యాయాలు మన తోటి వారినేగాదు ఎవ్వరిని ఎలాంటి సమయాలలోనైనా HURT చెయ్యకండని పదేపదే చెప్పియున్నారు. సాధనకది పెద్దదెబ్బ. ప్రాంతీయాభిమానంతో ఇతర ప్రాంత వాసులను మనం బాధించకూడదు, సాధించకూడదు. అందరం ఒకే దైవాన్ని ఆరాధించేవారమే. భిన్న భిన్న ప్రాంతాలలో నివాసమున్న మనమంతా పర్వదినాలలో ఏకత్వభావాలతో ఏకభావారాధనతో మనదైవాన్ని సందర్శించటానికి ఉత్సాహించే సమయంలో అందరికి తగినంత చేయూతనిచ్చి ఆనందపర్చాలి. ప్రాంతీయ అభిమానంతో ఇతర ప్రాంతవాసులకు కష్టం కలిగిస్తే అది గురుసేవ ఎలా అవుతుంది? నీకున్న తపననే ఎదుటివారిలోను చూడగలగాలి. గురుసేవకు, గురుదర్శనానికి ఆటంకపర్చరాదు. గురుపరంగా ఆనందపర్చువారి ఆనందం నీ హృదయాన్ని తాకుతుంది.

సత్సంగాల్లో అందంగా ఆకర్షణీయంగా అలంకారికంగా చెప్పడంవల్ల చెప్పేవారికి అభిమానులు హెచ్చౌతారు అంతే. అంతకు మించి ఒరిగేదేముంది. మనం మాట్లాడే ముదిత - మోదము - ప్రేమ - కరుణ, రసహృదయం -మొదలగు వాటిని ఆచరణలో చూపి ఆదర్శవంతంగా నిలబడగల్గిననాడు గురుచరణాలయందు కుసుమంగా ఉండగల్గుతారు. **"గురువుకు సంతోషదాయకమైన పనులే మనం చేయాలి."**

> "అహింసార్ధాయ భూతానం ధర్మప్రవచనం కృతం
> యస్మాత్ అహింసా సంయుక్తః ధర్మఇతినిశ్చయః"  శాంతిపర్వం. 109/15

సర్వప్రాణులను హింసించకుండా ఉండేందుకే మహాత్ములు ధర్మప్రచారం చేస్తారు.





అహింసను ఇముడ్చుకున్న సత్యమే ధర్మనిశ్చయమని శాంతి పర్వంలో వ్యాసభగవానులు చెప్పారు.

ఆత్మజ్ఞానం పొందటానికి అహింస చక్కని మార్గమని భగవద్గీత బోధించింది.

"అహింసా - అపేడా ప్రాణినాం (శంకర భగవత్పాదులు)

ప్రాణులకు ఎలాంటి బాధను కలిగించక పోవటమే అహింస. యుగానికో మహాత్ముడు చెప్పింది వినక పోయినను, నేటి యుగానికి అందివచ్చిన దైవం **మన "శరద్బాబూజీ" గారి మాట ప్రకారమైన సాటివారి మనసునొప్పించవద్దనే ముత్యమంత మంచి మాటను మనసులో మాటిమాటికి మననం చేసికోవడం వల్ల మన మనసులకు, మనకు, మన వ్యక్తిత్వాలకు మంచి జరుగుతుంది.**

## "బాబూజీని అడిగా - బాబు పుట్టాడు"

నా పేరు పెదరామయ్య. మాది ప్రకాశంజిల్లా, దరిశి మండలం, పోతవరం. నాకు వివాహం అయి 5 సంవత్సరములు అయినది. పిల్లలు లేరు. మేము అందరి దేవుళ్లను పూజిస్తాము. అన్నిచోట్ల తిరిగినాము. పిల్లలు కలగలేదు. మాతమ్ముడు శ్రీనివాస్ (పిన్నికొడుకు) దరిశిలో సత్సంగాలకి వెళ్తుంటాడు. బాబా, గురువుగార్ల గురించి మాయింటికి వచ్చి చెప్తుంటాడు. మేము మొదట్లో వాడిమాటలు లెక్కచేయలేదు. అప్పడు మావాడు బాబా, గురువుగారు ఉన్నటువంటి గ్రీటింగ్ కార్డు ఇచ్చి మనస్ఫూర్తిగా గురువుగార్ని నమ్ముకోండి. మీకు వీలైనంత త్వరలో మేలు జరుగుతుంది అన్నాడు. అప్పటినుండి మేము బాబాగార్ని గురువుగార్ని ఆర్తితో పూజిస్తున్నాము. కొన్ని రోజులకు మాకు బాబా, గురువుగార్ల మీద పూర్తినమ్మకం కలిగింది.

ఆ తరువాత ఒకరోజు మాఇంటిలో సత్సంగం చేయవలసినదిగా మా తమ్ముడ్ని అడిగినాను. అప్పడు వాడు దరిశి సత్సంగమందిరం వాళ్ళతో మాట్లాడి మా ఇంటిలో సత్సంగం జరిపించినాడు. ఆ సత్సంగం చూడటానికి వచ్చిన భక్తులు బాబా, గురువుగార్ల గూర్చి చెప్తుంటే విని వారి ఇళ్ళ దగ్గర కూడ సత్సంగాలు చేయవలసినదిగా చాలా మంది కోరినారు. ఆ తరువాత కొంతకాలానికి అనగా 27-4-2002 న మగపిల్లవాడు జన్మించినాడు. దీన్ని చూసిన మా ఊరి ప్రజలందరు ఆశ్చర్యంతో అన్నమాటలు - వాళ్ళకు **5 సంవత్సరముల నుండి తీరని కోరిక బాబాని, గురువుని నమ్ముకోవడంవలననే తీరింది అని** అంటున్నారు.

(పోతవరం, దరిశి)

సదా బాబా, బాబూజీల సేవలో
**ఓ. పెదరామయ్య**









# దేశకాల పరిమితులకు అతీతం - గురుకృప

ప్రియ గురుబంధువులకు,

నాకు పూజ్యగురుదేవులు ప్రసాదించిన అనుభవాలు ఎన్నో! వాటిలో ఒక అనుభవాన్ని చెప్పితీరవలసిందే.

కొన్ని సంఘటనల ఫలితం తప్పక మనకు ప్రతికూలంగా, చాలా ఒత్తిడికి లోనయ్యేటట్లు చేస్తుంది. ఇక మనకు ఇబ్బందులు తప్పవనుకున్న క్షణాన, సద్గురు అనుగ్రహం మనలను కాపాడిన క్షణాన మనకంటే ఆనందించే వ్యక్తి మరొకరు ఉండరన్నట్లు చేస్తుంది కదూ! (మీరు నా అనుభవంతో ఏకీభవిస్తారని), ఇది ఎందరో గురుబంధువుల అనుభవమని నా తలంపు. నాకు జరిగిన ఒక అనుభూతిని మీతో పంచుకొని మిమ్ములనానందపర్చి నేను ఆనందిస్తాను.

నేను అమెరికా సంయుక్త రాష్ట్రాలకు (USA) B1 VISA పై వచ్చాను. ఈ వీసాతో నేను పరిమిత కాలంపాటే USA లో ఉండగల్గుతాను. కాని, నాకు ఇక్కడే (USA) ఉండి ఉద్యోగం చేసుకోవాలని ఉంది. దాని కోసం H1 VISA తీసికోవల్సి ఉంది. అయితే నా B1 VISA ఏప్రిల్ 20వ తేదీతో అయిపోతుంది. H1 VISA నాకు రాలేదు. కాబట్టి నేను ఏప్రిల్ 20 లోపే భారతదేశం వచ్చేయవలసి వస్తుందని భావించాను. ఇంతలో నాకు 'మిష' రూపంలో సూర్యప్రకాష్ అనే వ్యక్తి పరిచయం అయ్యారు. వీరు నన్ను 'బాబా' "గురువు" గార్లపై విశ్వాసముంచమని, బాబా గురూజీలు ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటారని తెలిపారు.

ఇలా ఆపదలో ఉన్న నాకు, సద్గురు అనుగ్రహఫలితమేమిటో ఊహించగలరా! నాకు ఏప్రిల్ 19వ తేదీన H1 VISA లభించింది. ఇది ఖచ్చితంగా సద్గురు అద్భుత అనుగ్రహప్రభావమే! నాకు సద్గురు అనుగ్రహంతో జరిగిన ఒకానొక అద్భుతమిది. నావద్ద సద్గురు అనుగ్రహ అనుభవమనే "పాలపుంత" లో ఎన్నో నక్షత్రాలున్నాయి. అనుగ్రహానుభూతులనే నక్షత్రాలతో మరల మీముందుకు ....

మీ గురుబంధువు

**వినోద్**







## "నాకోసమే ఇలా చేసారు గురువుగారు"

నేను ఒకసారి రాయ్‌చూర్ ఇంటర్వ్యూకి వెళ్ళి అక్కడనుండి శిరిడికి బయలుదేరాను. అక్కడనుండి శిరిడికి దోండులో దిగి వెళ్ళమని చెప్పారు. నేను రైల్వేస్టేషన్‌కి వెళ్ళి టిక్కెట్టు తీసుకొని ట్రెన్‌లో కూర్చున్నాను. ఉదయం 2.30 సమయంలో దోండు వస్తుందని ప్రక్కవారు చెప్పారు. కానీ ఈ ట్రెన్ దోండులో ఆగదని, తరువాత స్టాప్ పూనేలో దిగి శిరిడి వెళ్ళవలసి వస్తుందని చెప్పారు. అసలు ఆ రూట్‌లో నేను వెళ్ళడం అదే మొదటిసారి. అంతే కాకుండా డబ్బులు కూడా తక్కువ ఉన్నాయి. ఇంతలోనే దోండు రైల్వేస్టేషన్ వచ్చింది. నేను నా లగేజ్ డోర్ దగ్గర ఉన్నవానికి ఇచ్చి ఏమాత్రం స్లో అయినా దిగిపోతే, నా లగేజ్ అతను విసిరేస్తాడు అని చూచాను. కానీ అది ప్లాట్‌ఫామ్ ఉన్న ట్రాక్ కాకుండా మధ్య ట్రాక్‌లో వెళ్తోంది. నేను అలాగే డోర్ దగ్గర నిలబడ్డాను. ఇంతలో ట్రెన్ ఉన్నట్టుండి చాలా స్లో అయింది. కానీ ఎదురుగా ఉన్న సిగ్నల్ గ్రీన్ మాత్రమే. నేను క్రిందకి దిగితే అక్కడ డోర్ దగ్గర కూర్చున్నతను నా లగేజ్ విసిరివేశాడు. నేను దిగీదిగుతుండగానే మళ్ళీ ట్రెన్ చాలా ఫాస్టుగా వెళ్ళిపోయింది. ఈ సంఘటన జరిగిన మొదటి నుండి గమనిస్తే

1. Particular Station లో ఆగని ట్రెన్‌కి టిక్కెట్టు ఇవ్వరు, కానీ గురువుగారు నాకు టిక్కెట్టు ఇప్పించి ట్రెన్‌లో కూర్చోబెట్టారు.
2. పోనిలే స్టాప్ ఏమన్న ఉందనుకుందామా, మధ్య ట్రాక్‌లో ట్రెను వెళ్ళింది (ఏ ప్లాట్‌ఫామ్ లేదు)
3. జనరల్‌గా ట్రెను movement adjustment ఉంటే outskurts లో చేస్తారు. కానీ గురువుగారు నా కోసం గ్రీన్ సిగ్నల్ ఉన్నా కూడా ట్రెన్ మధ్య ట్రాక్‌లో, స్టేషన్ మధ్యలో ఆపారు.

నాకు ఎటువంటి డౌటు లేకుండా నీ కోసమే ఈ ట్రెనుని ఆపాను అని తెలియజేశారు.

**రామకృష్ణ,** (హైదరాబాదు)

ఇంటర్ నెట్ లో "గురుకృప" - *Visit :* **www.guruji.org**





## చిన్నమనసు - పెద్దహృదయం

ది. 11-03-02 న నాపుట్టిన రోజు. తెల్లవారుఝామున గం॥ 3.45 ని॥లకు నిద్ర లేచి నగర సంకీర్తనానికి 'రెడీ' అయి బయటకు వస్తున్నాను. ద్వారం వద్ద రామకృష్ణ (కరూర్ వైశ్యాబ్యాంక్)ను ఆ చిరుచీకటిలో చూసి ఆశ్చర్యపోయాను. రామకృష్ణతో పాటు అనిల్‌కూడా ఉన్నాడు. మా ప్రోగ్రాం ప్రకారం మేము ఉదయం 4.00 గం॥లకు సత్సంగకేంద్రంలో కలవాలి. నిన్నటి మా ప్రసంగంలో నా పుట్టిన రోజు సంగతి తెలియటం చేత నాకు జన్మదిన శుభాకాంక్షలు అందజేయటానికి ఇంత ఉదయాన్నే వచ్చారట. వారి అభిమానానికి నాకు ఆశ్చర్యం, ఆనందం కలిగాయి.

అంతకుముందు అతనివద్ద "సచ్చరిత్ర" ఇంగ్లీషు పుస్తకం ఉండడం నేను చూసాను. భాష చాలా సరళంగా ఉంది. "ఇప్పటివరకు దీన్ని నేను చూడలేదు" అని వాళ్లతో అన్నాను.

"11వ తేదీ పుట్టిన రోజు గ్రీటింగ్స్ అందజేయటానికి వచ్చిన ఈ మిత్రులు ఏదైనా గిఫ్ట్ తేకుండా ఉంటారా"! అని అనుకున్నాను. "సచ్చరిత్ర" ఇంగ్లీషు పుస్తకం ఇస్తే బాగుండును" అని నా మనసులో కోరిక. కానీ ఆ రోజు వాళ్ళు బిజీగా ఉండటం వల్ల ఆపని ఆ మరునాడు, అంటే 12వ తేదీన చేశారు. నేను మనసులో కోరుకున్న విధంగానే సత్సంగసమయంలో సచ్చరిత్ర ఇంగ్లీషు పుస్తకాన్ని తెచ్చి ప్రేమతో నాకు జన్మదినకానుకగా అందించారు.

"ఆహా! గురూజీ! ఏమి నీ లీల! సచ్చరిత్ర పుస్తకం కావాలి" అనే నా చిన్న మనసులోని కోరికను పెద్ద హృదయంతో (గొప్ప హృదయంతో) అర్థం చేసుకొని వెంటనే తీర్చావా, దేవా! అని ఆనందంతో అనుకుని, ఈ సంగతి ఒకరికొకరం చెప్పుకొని ఆనందించాం.

తేది. 12-03-2002 **రత్తయ్య,** (శిరిడి)

మీ అనుభవాలు, పత్రికకు మీరిచ్చే సలహాలను సాదరంగా ఆహ్వానిస్తుంది **"గురుకృప"**. మీ వ్యాసాలను, అనుభవాలను 15 తేదీ డిశంబరు, 2002 లోపు క్రింది చిరునామాకు పంపిన జన్మదిన సంచికకు స్వీకరింపబడతాయి. తరువాత వచ్చే వాటిని శ్రీరామనవమి సంచికకు స్వీకరించబడతాయి.

"గురుకృప" - 22-1-50, జి.వి.కాంప్లెక్స్, గాంధీచౌక్, తెనాలి - 522 201

"గురుకృప" - సాయివరప్రాసాదం, సత్యనారాయణ వీధి, రామలింగేశ్వర పేట, తెనాలి - 522 201





## ఆనందదాయకం - సాయిపథం

నాకు ఇంత మంచి అనుభవాన్ని ప్రసాదించిన గురుదేవులకు హృదయ పూర్వకంగా పాదనమస్కారం చేసుకుంటూ ...

నా పేరు సుష్మ, మాది విజయవాడ. గురువుగారు శిరిడి నుండి వెళ్ళేటప్పుడు ద్వారకామాయికి వచ్చి వెళ్తారని చాలా మంది అంటుంటే విని, అట్లా వచ్చినపుడు ప్రశాంతంగా గురువుగారిని దర్శనం చేసుకోవాలనే కోరిక వుందినాలో. నాకు ఎప్పటినుండో ఉన్న ఆ కోరికను గురువుగారు 2001 గురుపౌర్ణమికి వెళ్ళినపుడు తీర్చారు. జూలై 11వ తేదీన నేను, కొండయ్యగారి అమ్మాయి సాయి ఇద్దరం గురుస్థాన్‌లో ప్రదక్షిణాలు చేసి తెల్లవారుఝామున 4.25 ని॥లకు ద్వారకామాయికి వచ్చి సాంబ్రాణి కొనటానికి బయటకు వచ్చాము. అప్పుడు అక్కడ ఉన్న ఒక అబ్బాయి నాతో మీ గురువుగారు వచ్చారు, చావడి దగ్గరవున్నారు అన్నాడు. నా ఆనందానికి అంతులేదు. ఒకసారి చావడి వైపు చూడగా గురువుగారు, అమ్మగారు బయట నిలుచుని నమస్కారం చేసుకుంటున్నారు. ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళల్లో మెదులుతూనే వుంది. ఇంకెప్పటికీ ఆ దృశ్యాన్ని మరచిపోలేను కూడా. ఆ రోజు నా జీవితంలో ఎంతో మధురమైన, మరపురాని రోజు.

సరే, గురువుగారు ద్వారకామాయికి వస్తారు కదా అని నేను, సాయి ద్వారకామాయికి వెళ్ళాము. గురువుగారు చిన్నగా నడుచుకుంటూ వస్తున్నారు. గురువుగారి వెనకాల గాని, ఆ ప్రాంతంలో జనాలు, తోపులాటలు, మీదపడటాలుగాని ఏమీ లేవు. గురువుగార్కి బాబా పైన వున్న అనన్యప్రేమను వ్యక్తీకరించే గురువుగారి మోమును చూస్తూ అలా ఎన్నాళ్ళయినా వుండిపోవాలనిపించింది. దాదాసాహెబ్ ఖాపర్డే బాబా చిరునవ్వు కోసం.. ఎన్ని జన్మలయిన వేచివుండవచ్చులా! గురూజీ ద్వారకామాయి లోపలికి వచ్చేసరికి లోపల శుభ్రం చేస్తున్నారు. గురువుగారు అప్పుడు ఆ మెట్ల వద్ద బాబాకు సాష్టాంగ నమస్కారం చేసుకున్నారు. ఆ సాష్టాంగ నమస్కారాన్ని చూడటానికి రెండు కళ్ళూ చాలవు. గురువుగారు సాష్టాంగ నమస్కారం చేస్తున్నప్పుడు నా మనస్సులో ఏదో వింతైన ఆనందమైన అనుభూతి. We can't express those feelings to full extent, even though if we try to express those feelings, something remains unexpressable. తరువాత గురూజీ వెనక్కి వచ్చి ఒక నిముషం





కూర్చొని ధ్యానం చేసుకున్నారు. మేమంతా వెనకాల నుంచొని వున్నాము. ఆ తరువాత లేచి మళ్ళీ చిన్నగా గురుస్థానం వైపుకి నడుస్తున్నారు ఆయన వెనకాల నడుస్తున్న మాకు ఎంతో ఆనందం. నేను, సాయి అయితే ఎగురుతూ గురువుగార్ని అనుసరిస్తూ నడుస్తున్నాం. దారిలో ఇనుపగేటు వద్ద నుండి బాబాకు నమస్కారం చేసుకున్నారు గురూజీ. ఆయన బాబాకు చేసే నమస్కారం తీరు అత్యద్భుతం - అది వర్ణించనలవి కానిది. బాబాకు నమస్కారం చేసేటప్పడు చూడాలి - ఇంత అద్భుతమైన తీరులో కూడా నమస్కరించుకోవచ్చా! అనిపించింది. అక్కడ నుండి గురుస్థానమువద్దకు వచ్చారు. గురూజీ గురుస్థానం చుట్టూ మూడు ప్రదక్షిణాలు చేసారు. ఆయన వెనకాల ప్రదక్షిణాలు చేసే అదృష్టం మాకు లభించింది. ప్రదక్షిణాలు చేసిన తరువాత బాబా ముందర సాష్టాంగనమస్కారం చేసారు. ఆ తరువాత అమ్మగారు కూడా సాష్టాంగనమస్కారం చేసారు. అక్కడనుండి చిన్నగా నడచుకుంటూ పూల కొట్లుదాకా నడచి వెళ్ళి, అక్కడ కారు ఎక్కారు. అలా గురూజీ ద్వారకామాయికి వచ్చినప్పటి నుండి కారు ఎక్కేదాకా ప్రతినిమిషం, ప్రతి **అడుగులో మాటలలో** వివరించలేని ఎంతో ఆనందాన్ని అనుభవించాను. అంతవరకూ అటువంటి ఆనందాన్ని ఎప్పడూ అనుభవించి ఉండలేదు.

**"ఆనందదాయకం సాయిపథం"** అనే మాటకి నిజమైన అర్థం అప్పడు అవగతమయిందినాకు. ఇలాంటి ఎన్నో ఆనందదాయకమైన అనుభూతులను మళ్ళీ మళ్ళీ గురూజీ ప్రసాదించాలని కోరుకుంటున్నాను.

తేది. 28-01-02 **సి.హెచ్. సుష్మ,** (విజయవాడ)

ఎన్నో జన్మలు కఠోరతపస్సు చేసినా క్షాళనకాని ఎన్నో మలిన విషయవాసనలను సద్గురువు కేవలం తన కృపా విశేషంతో మటుమాయం చేస్తారు.

శరీరాన్ని శోశింపచేయడం **"తపస్సు"** కానేకాదు. అహింస, సత్యము పలకడము, ఇతరులకు దుఃఖము కలిగించు పనులు చేయకుండటం, దమము - దయ - ఇవి **"తపముల"**ని విజ్ఞులు చెపుతారు.

- సాయి భక్తి సాధనరహస్యం

## సాయిపథం

కలల తీరంలో, కనిపించని జీవితబాటలో, నిరంతరం కదలాడే భావతరంగాల్లో, నిస్సత్తువతో నిదురిస్తున్న నన్ను నూతన జీవిత ఆశయపథంలోకి ఊతమిస్తూ, సరికొత్త సుమార్గాలను స్ఫురింపచేస్తూ, ప్రతినిత్యం, ప్రతినిముషం, ప్రతిక్షణం సాయిపథాన్ని కాపాడుతూ, విస్తరిస్తూ, సాగుతున్న

ఈ (నా) సాయినాథుని శరత్‌గురు సాయిపథం

ఊపిరాడని బాధలతో, విసుగునిచ్చే పిచ్చి ఊహలతో, ఏకాగ్రతయే ఎండమావులయి అట్టడుగుస్థాయికి అంతరించి పోతున్న జీవితపయనంలో ఊహించనంత విశాల సాయిపథంలో వివరింపలేని వినమ్రత తోడుగా, నూతన నడవడికతో సాయితోడుగా పసిడి జీవితాన్ని ప్రసాదించెనే

ఈ (నా) సాయినాథుని శరత్‌గురు సాయిపథం

కులమతాల ఉచ్చుచిచ్చుతో ఉడికి పోతున్న సమాజంలో, సిరిసంపదల అహంభావంతో, అలివిగాని అసూయాద్వేషాలతో అంతరిస్తున్న జగతిలో, కలిదోషాన్ని ధిక్కరిస్తూ, కర్మకాలాన్ని శాసిస్తూ, అన్యభావాల్ని ఆదమరపించుతూ, **"సాయినామం"** తో సర్వత్రా శుద్ధిచేసి, సాయిపథం కోసం సదా ఆత్రుతతో **"సాయి"** ని ఆరాధిస్తూ అందుమనల్ని ఆనందింప చేసేనే

ఈ (నా) సాయినాథుని శరత్‌గురు సాయిపథం

ఆడంబరాల ఆర్భాటాలతో అలసిపోయి, అలలవలె అంతరించని కోర్కెల వడిలో విసిగిపోయి, తుచ్ఛమనస్సుతో తెగిన గాలిపటంలా సంచరించే సందర్భంలో నిలువరించె **"సాయినామం"** తో, అనుభవిస్తున్న, అనుభవించబోయె చెడు కర్మలను సైతం కూకటి వ్రేళ్ళతో తొలగించి, సాగించే జీవిత పయనం, (నిరంతరం సుక్షేత్రాల స్థాపనలో)

ఈ (నా) సాయినాథుని శరత్‌గురు సాయిపథం

పేరుకోసం, వాంఛకోసం, ధనంకోసం, దైవాన్ని, దైవత్వాన్ని దశదిశలు మార్చి దైనిందిక జీవితాన్ని దొంతర్లు పెట్టే స్వార్ధస్వాముల సంఘంలో నిజానిజాలని, అవాస్తవాలని, కల్పనలను, నిక్కచ్చిగా నిగ్గుతేల్చి, నిజమైన సాయి సుబోధాలను చాటుతూ, నిరంతరం

ప్రగతి పథంలో ప్రకాశిస్తూ పయనిస్తూ సాయిభక్తులకు సాయిప్రేరణను స్ఫురింపచేస్తూ సాగుతున్న

ఈ (నా) సాయినాథుని శరత్‌గురు సాయిపథం

ఈ నిగూఢ ప్రపంచంలో, పంచభూతాల పరిహాసంతో, అరిషడ్వర్గాల అధీన అజమాయిషీలతో నిరంతరం నివసిస్తూ, నీరసిస్తూ, ప్రేమవాత్సల్య పంజరంలో బందీ అయిపోయి అలమటించువేళ మెరుపులోని సహజత్వాన్ని సొంతం చేసుకొంటూ, పూర్ణ చంద్రుడిని సైతం తన వెలుగుతో విస్తుపరుస్తూ, "రవి" పథాన్ని సైతం తన "పథం" లో పయనించేటట్లు చేస్తూ మనకి తరగని "సాయి" శక్తితో ఊతమిస్తూ, నిరంతరం సాయి ప్రేమామృత ధారలతో వరిస్తూ, వర్షింప చేస్తూన్న

ఈ (నా) సాయినాథుని శరత్‌గురు సాయిపథం

**కె. లక్ష్మీకుమార్,** (తెనాలి)

## అవసరమయిన వేళ నీవడగవలసిన పనిలేదు

నా పేరు దేవి. మాది కొవ్వూరు. మా అక్క విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఉంటుంది. అక్క విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంట్ సెక్టర్-XI లో జరిగే సత్సంగానికి వెళ్తూ ఉంటుంది. అలా నేను అక్కతో వెళ్ళేదాన్ని. అలా గురువు యొక్క అవసరం తెలిసింది. గురువుగారంటే నాకు నమ్మకం కలిగింది. ఎక్కువగా అక్కగారింట్లో ఉండడంవలన సత్సంగాలకు మిస్ అవకుండా వెళ్తుండేదాన్ని. గురుపూర్ణిమ యొక్క ప్రాశస్త్యం శ్రీ ఎస్. వి. ఎల్ నారాయణరావుగారు వైజాగ్ వచ్చినప్పుడు సత్సంగంలో చెప్పారు. ఏమైనా సరే గురుపౌర్ణమికి (సం॥ 2001) శిరిడి వెళ్ళాలి అనుకున్నాను. గురువుగార్ని నన్ను శిరిడి తీసుకువెళ్ళమని అడిగాను. అప్పడు నేను శిరిడి వెళ్ళే పరిస్థితులు లేకపోయినా గాని గురువుగారు వాటన్నింటినీ తీసివేసి నన్ను శిరిడి తీసుకువెళ్ళారు. అదెలాగంటే అక్క తనకని తీసుకున్న టిక్కెట్టుతో (తనకి వెళ్ళడానికి వీలు లేక) నన్ను పంపింది. అసలు నేను టిక్కెట్టు కూడా తీస్కోకుండానే గురువుగారు నా కోరిక ఇలా తీర్చారు.

**గురువుగార్ని (శిరిడిలో), బాబాను (మందిరంలో) ఎక్కువ సేపు చూడాలి** అని నేను కోరుకున్నాను. అలాగే మందిరంలో నేను బాబా ముందరకి వచ్చేసరికి అందర్నీ ఆపేసి

10 ని॥లు బాబాకి ఎదురుగా వుండి చూస్తూ గడిపే అవకాశాన్ని కల్పించారు. ఇలా కోరుకున్న వెంటనే అలా నా కోరిక తీర్చారు గురువుగారు. గురువుగార్ని మధ్యప్రదేశ్ వెళ్ళేటప్పుడు (మందిర ప్రారంభోత్సవంకి), వచ్చేటప్పుడు కూడా దర్శనం చేసుకోవాలనుకున్నాను. ప్రదక్షిణాలు చేస్తూ (గురుస్థాన్‌లో) నేను వెళ్ళేవరకు గురువుగారు ఎమ్.పి. వెళ్ళకుండా వుండాలి, గురువుగారు వెళ్ళేటప్పుడు నేను చూడాలి అనుకున్నాను. అలాగే నేను ప్రదక్షిణాలు పూర్తి చేసి వచ్చేవరకు గురువుగారు యానాలోనే ఉన్నారు. గురువుగారు కారెక్కి వెళ్తున్నప్పుడు ఆయన చుట్టూ ఎంత మంది గుమిగూడినా, నాకు గురువుగారి దర్శనం బాగా జరిగింది. ఇలా కోరికలో సగభాగం తీరింది. అలాగే గురువుగారు ఎమ్.పి నుండి వచ్చేటప్పుడు కూడా దర్శించుకోగలిగాను. అందరూ ఆయన రావడం లేట్ అవుతుందని చెప్పినా, నేను యానాలో ఉన్న టైమ్‌లోనే (నేను కోరుకున్న విధంగానే) గురువుగారు ఎమ్.పి. నుండి రావడం జరిగింది. అప్పుడు కూడా నేను, ఎంతోమంది ఉన్నప్పటికి గురువుగార్ని తనివితీరా దర్శించుకోగలిగాను. నేను రాసిన బి.ఎ. ఎంట్రెన్స్ పరీక్షలో పాసవ్వాలని కోరుకుందామనుకున్నాను ఊదిదర్శనంలో, కాని గురువుగారు ఊది దర్శనం ఇవ్వలేదు. నేను ఆ విషయం గురువుగారికి చెప్పకోలేకపోయినా ఫర్వాలేదు, మేము ఎందుకు వచ్చామో గురువుగారికి తెలుసు అనే ఉద్దేశ్యంతో నేను తిరిగి వచ్చేసాను. ఇంటికి వచ్చేసరికి ఆ పరీక్షలో నేను పాస్ అయినట్టుగా అక్క చెప్పింది. నా ఆనందానికి అవధులులేవు. గురువుగారికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాను. మనం నోరు విప్పి అడక్కపోయినా, మనకి ఏమికావాలో గురువుగారికి తెలుస్తుందనే విషయం తెలిసింది నాకు ఈ అనుభవంతో.

శిరిడిలో నా వాచీ, కొంత డబ్బు పోయినవి. అవి పోయినందుకు బాధలేదుగాని, ఇంట్లో వాళ్ళు ఏమంటారోనని భయమేసింది. ఇది గురువుగారికి మనసులో చెప్పకుని, ఇంట్లో వాళ్ళు ఏమీ అనకుండా చూడమని వేడుకున్నాను. నేను ఇంటికి వచ్చాక ఈ విషయం చెప్పాను, ఎవరూ ఏమీ అనలేదు, పోనిలే అన్నారు. దానితో నాకు చాలా నమ్మకం కలిగింది. ఈ అనుభవాల ద్వారా **"అవసరమయిన వేళ మనం అడిగినా, అడగకపోయినా, వాటిని మన కందిస్తారు"** అనే గ్రహింపు కలిగింది నాకు. గురువుగారి దివ్యదృష్టి ఎల్లప్పుడు మనందరి మీద ఉండాలని కోరుకుంటున్నాను.

మీ గురుబంధువు

**పి. దేవి** (కొవ్వూరు)





# గురువుగారు, బాబాగారు కరుణించారు

***ఓం సాయి, శరత్ బాబూజీ గురువే నమః***

మాది అవనిగడ్డ మండలం, పులిగడ్డ గ్రామం. నాపేరు పారేపల్లి సూర్యనారాయణ, గురుబంధువులందరితో మా అనుభవమును గురుకృపద్వారా పంచుకొనుచున్నాము. నా మనవరాలు అనగా మా పెద్దమ్మాయి రెండవకూతురుని మా అన్నయ్యగారి మనవడికి యిచ్చి వివాహము చేసినాము. ఆ అమ్మాయి, మేము కూడా బాబా, బాబూజీల పూజలు ప్రతిరోజు చేసుకొంటాము. బాబాగారి దయ, గురువుగారి కృపవల్ల గర్భము వచ్చి నెలలునిండినవి. కాని ఏ ఆసుపత్రిలో చూపించినా అమ్మాయికి కాన్పుకష్టం, ఆపరేషను చేయవలసిందేనని చెప్పినారు.

ది. 12-6-2002 బుధవారంరోజున అవనిగడ్డ గవర్నమెంటు ఆసుపత్రిలో చూపించినాము. అక్కడి డాక్టరమ్మగారు కూడా అమ్మాయికి పెద్ద ఆపరేషను చేయాల్సిందే, రేపేచేద్దాము జాయిన్ చేయమని చెప్పినారు. ది. 13-6-2002 గురువారం కదా బాబాకి ఇష్టమయిన రోజు అని వెనకాముందు చూడకుండా జాయిన్ చేసినాము. డాక్టరమ్మగారు ఆపరేషన్ చేసినారు. పగలు 1-35 ని॥ లకు బాబుకి జన్మనిచ్చింది. తరువాత డాక్టరమ్మగారు - బాబు ఫర్వాలేదు, కాని తల్లికి మేము గ్యారంటీ చెప్పలేము అని చెప్పి మా అందరిని కంగారులో, దుఃఖంలో పడవేసినారు. డాక్టరుగారూ, మీరు చేయవలసింది చేసారు! ఇంకా చేస్తున్నారు! ఇక అంతా సాయిబాబా శరత్‌బాబుగార్లదయ. మనము చేసేదేమున్నది అని బాబాని, గురువుగారిని మేము అందరము మనసులో ప్రార్థించుకొన్నాము. మా మొర ఆలకించి బాబా, గురువుగారు కరుణించారు.

తల్లి, పిల్లవాడు కులాసాగా వున్నారు. ఇది అంతా బాబా, గురువుగారి కృపవల్లనే జరిగింది.

25-06-02 **పారేపల్లి సూర్యనారాయణ,** (పులిగడ్డ)

**ఆధ్యాత్మికత అంటే ఆనందంగా జీవించటమే.**
**అసలు బాబా భక్తుడిగా వుండటమే - ఆనందం** శ్రీ బాబూజీ







## "పాపప్రాణాలు కాపాడిన గురుదేవులు"

నా వదిన 9వ నెల గర్భిణిగావున్నప్పడు తిరువన్నామలైలోవున్న గురుదేవులను పాపగురించి ప్రార్థించాము. ఆయన సంకల్పమా! అన్నట్టు, మొదట ఆపాప "బాబా" అనే పిలిచినట్లు అన్నా, వదినలు చెప్పారు. వారికి కూడా బాబా అంటే ఇష్టం. వారు శిరిడికి కూడా వచ్చారు. ఆపాప చాలా ఫాస్ట్ మరియు చలాకీగా నడుస్తుంది అప్పడప్పడు "బాబా"గుర్తుకొచ్చినపుడు 'బాబా' 'బాబా' అని అనుకుంటూ ఇంటిలో దేవుని రూము తలుపు తడుతూవుంటుంది. అలా 'బాబా బాబా' అంటున్న ఆ పాప ప్రాణాలను బాబా ఎలా కాపాడారో వినండి.

"జూలై 6, 2002న ఉదయం 8.30 గం। ప్రాంతంలో ఇంటిలో ఎవరి పనులలో వారు వుండి పాపను మరిచారు. మా అమ్మగారు కరివేపాకు కోసం ఇంటిముందు ప్రహరీ దగ్గర వున్న చెట్టు వద్దకు వెళుతుండగా పాప 'కావ్' అన్నచిన్న శబ్దం విని ఎక్కడవుంది పాప అని అటూ ఇటూ చూడగా మూలవున్న వాటర్‌సంప్‌లో అప్పడే నీటిలో నుండి లేచి మోటర్ పైప్‌ను రెండుకాళ్లతో, రెండుచేతులతో పెనవేసుకొని వున్నది. ఈ పరిస్థితి చూడగానే మా అమ్మగారి గుండె నీరుకారి, సంప్‌లోకి దిగి బిడ్డను లాక్కొన్నది. పాపమాట పడిపోతున్నది. పొట్టవత్తగా అరగ్లాసు నీళ్ళు బయటకు వచ్చాయి. ఆ సంప్‌లోతు 5 1/2 అడుగులు, పొడవు 5 1/2 అడుగులు, వెడల్పు 2 అడుగులు, 5 అడుగుల వాటర్ వుంది. మోటర్ పైప్‌ను చేరుకోవాలంటే 5 అడుగులు ఈదాలి. నెలలపాప 15 నిముషములు గాలిపీల్చకుండా బ్రతుకుటకష్టం. ఎంతసేపు నీటిలో వున్నది బాబాకే తెలియాలి. అందరూ ఆ పాపను మరిచినా బాబా, గురుదేవులు మాత్రం మరవక వెంటవుండి కాపాడి, అన్నావదినలకు పుట్టిన ఆయన బిడ్డను వారికి ఇచ్చారు. జూలై 18న ఆ పాప మొదటి పుట్టినరోజు.


**కె. చంద్రశేఖర రెడ్డి,** నెల్లూరు

**మనోసంయమనం కోసం పట్టుదలగా చేసే యత్నమే - నిష్ఠ**
**ఆధ్యాత్మిక సాధనలో మనోనిగ్రహం, సంయమనం అత్యావశ్యకాలు.**
**సంయమనం సాధించకపోతే సంపూర్ణ శరణాగతి సున్నా.**

**- సాయి భక్తి సాధనరహస్యం**









## ఆపరేషన్ ఆపింది గురువే

నాపేరు చీదెళ్ల హృషీకేశవరావు. నివాసం తెనాలి. స్వగ్రామం చేబ్రోలు. నాకు ఆగష్టు 3న హార్టుఎటాక్ వచ్చినది. వెంటనే కార్డియాలజిస్ట్ మురళీబాబూరావు, ఎమ్.డి., డి.ఎమ్, ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ ఆఫ కార్డియాలజీ, గవర్నమెంటు జనరల్ హాస్పటల్ గుంటూరు వారి దగ్గరకి వెళ్లినాను. వారు 5 రోజుల ట్రీట్‌మెంట్ తీసుకొని ఒకవారం హాస్పటల్‌లో ఉండాలని చెప్పినారు. కాని నాకు 6వ రోజు గురువుగారు తెల్లవారుఝామున స్వప్నదర్శన మిచ్చి తగ్గిపోయినది అని చెప్పి బ్లెసింగ్స్ ఇచ్చినారు. వారంరోజులు వుండాలన్న డాక్టరు అదేరోజు మీరు ఇంటికి వెళ్లవచ్చు అని చెప్పినారు. మరల 15, 20 రోజుల తర్వాత టెస్ట్ కోసం వెళ్లినపుడు మీరు ఏంజియోగ్రాం టెస్ట్ చేయించుకోవాలండి, చాలా అవసరము అన్నారు. హైదరాబాదు మిడ్‌సిటిలో జాయిన్‌ఐతే నేను సెప్టెంబరు 9న వచ్చి చేస్తాను అన్నారు. అప్పడు మేము మా అల్లుడు ఎమ్. సత్యనారాయణ గారిని, కృష్ణమాస్టారు గారిని కూడా తోడుతీసుకువెళ్లాము. ఏంజియోగ్రాం టెస్ట్ చేసిన తర్వాత మీకు 3 వెసల్సు ట్విస్టు అయినవి బైపాస్‌సర్జరీ చేయించుకోవాలి రెండుమాసాలలో అని చెప్పినారు. నాకు భయం వేసినది. మేము దసరాకి శిరిడి వచ్చి 11 రోజులు వున్నాము. ఈ సమయంలో గురువుగారి దగ్గరకు వెళ్లి విషయమంతా చెప్పి, ఎట్లైనా సరే గురుదేవా నాకు బైపాస్ సర్జరి లేకుండా మందులతోనే తగ్గించమని వేడుకొన్నాను. నేను వున్నంతకాలం ఊది దర్శనమునకు వస్తాను అని చెప్పి, గురువుగారి అనుమతి తీసుకొని వచ్చాను. తర్వాత మరల నెల రోజులకి టెస్ట్‌కి వెళ్తే (ఈ లోపు రోజూ మందులు వాడుతున్నాను) మీకు అంతా నార్మల్‌గావుంది, ఆపరేషన్ అవసరం లేదు అని చెప్పినారు. అలాగే మరలా మందులు వ్రాసి ఇచ్చారు. అవి వాడుతూ ఒక నెలకు మరలా టెస్ట్‌కు వెళ్తే అన్ని రకాల టెస్ట్‌లు చేసి అంతాబాగుంది ఆపరేషన్ అవసరంలేదు అని ఖచ్చితంగా చెప్పినారు. ఇదంతా గురుదేవుల దర్శనభాగ్యమేనని గ్రహించి దీన్ని డాక్టరుగార్కి చెప్పి, గురువుగారి సాయిభక్తిసాధనరహస్యం, సాయిపథం సంచికకు సం॥చందా కట్టి మ్యాగ్జైన్స్ పంపినాను. డాక్టరుగారు రోజూరాత్రికి ఒక ఆర్టికల్ చొప్పన చదివి చాలా బాగున్నాయని చెప్పినారు. మీగురువుగారిని నేనుకూడా ఒకసారి దర్శనం చేసుకోవాలి ఎక్కడ వుంటారు అని అడిగినారు. నేను విషయమంతా చెప్పినాను. ఇలా గురువుగారు నన్ను రక్షించారు. వారికి నా నమస్సుమాంజలులు. వారి ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను. ఇలా గురువుగారు నాకు ఎన్నో అనుభవాలు ఇచ్చి నన్ను ఆదుకొన్నారు.

16-05-02 **హృషీకేశవరావు,** తెనాలి





# "ఆచేయి ఎంత హాయి"


## "కులం మత్తు మనిషికేగాని - అంటదది మహాత్మునికి"

"నీరూ - నీమా" లకు దొరికిన బిడ్డకు "కబీర్" అనే నామకరణం చేసారు. "దొరికిన బిడ్డను" అందులోను తల్లి తండ్రి ఎవరో తెలియని బిడ్డను, ముఖ్యంగా, కులం, గోత్రం, మతం తెలియని బిడ్డను - కులం, గోత్రం, మతం కలిగిన వారు పెంచాలంటే ఇబ్బందులెదురౌతాయని తెలిసే పెంచారు. నెమ్మదిగా మతపవనాలు వీచాయి. కొందరాబిడ్డను చంపివేయమన్నారు. ఇతని వలన మతపరమైన ఉపద్రవాలు తలెత్తే అవకాశాలున్నాయని భవిష్యవాణి తెలిసిన వారన్నారు. చంపటానికి ప్రయత్నాలు జరిగినవని కొందరన్నారు. అవి ఏవీ ఫలించలేదని మరికొందరన్నారు. వీటికి సంబంధించిన విషయాలు కధలు, కధలుగా ప్రచారంలో ఉన్నాయి. ఏది నిజమో! చెప్పాలంటే దైవాంశసంభూతులైన మహాత్ములు మాత్రమే చెప్పాలి. (గురువుగారి లాంటివారు)

వివాదాస్పదమైన అంశాలు కబీరు జన్మవృత్తాంతంలో తలెత్తుతాయి. ఇంతటి వివాదాస్పదమైన మహాత్ముల విషయంలో కబీరు ఆద్యుడనిపిస్తుంది. ప్రతిదీ వివాదాస్పదంగానే ఉంటాయి. ఇది మహాత్ముల చరిత్రలో సర్వసాధారణమనిపిస్తుంది. దొరికిన ఆధారాలను పరిశీలించి విక్రమశకం 1456 అని, క్రీస్తుశకమైతే 1398 అని తెలుతుంది. ఈ నాటికి కబీరు అనుయాయులు ప్రతిసంవత్సరం "వటసావిత్రి" పండుగ రోజున జన్మదినోత్సవం జరుపుకుంటారు. 1398లో "వటసావిత్రి" పండుగ జ్యేష్ఠపూర్ణిమ నాడు వచ్చింది. ఇంకా ఇంకా తరచితరచి చూస్తే ప్రచారంలో చాలా "కధలు - గాధలు" ఉన్నాయి. అన్నింటిని వివరించలేంగాని కొన్నింటిని తెలిసికొందాం.

"కబీరు"కు కరవీరుడనే పేరిట ఒక కధ వినిపిస్తుంది. ఒకానొక బ్రాహ్మణుడు వితంతువైన తన కూతుర్ని వెంటబెట్టుకొని "రామానందుని" దర్శనానికి వెళ్లారట. ఆమెవితంతువని తెలియకనే ''పుత్రప్రాప్తిరస్తు'' అని దీవించిన తరువాత రామానందులవారికి తెలిసిందట. నీకు ఎలాంటి కళంకమురాదని ఆబిడ్డను ఆశీర్వదించి, నీకు జన్మించే బిడ్డ సాధనసంపత్తిగల మహాత్ముడౌతాడన్నారట. తరువాత ఆమెకు చేతిమీద కురుపు లేచిందట. కురుపు పెద్దదై కొంత కాలానికి పగిలి ఒక మాంసపు ఖండము బైటపడి అందుండి శిశువు జన్మించాడట. అందుకే కరవరుడని పేరు పెట్టారట. ఇది ఒక కధ. ఆశీర్వచనం పొందిన అనంతరం ఆవితంతు స్త్రీకి జన్మించిన బిడ్డను లోకోపవాదుకు వెరిచి లహర్ తారా కొలనులో పడేసిందనే కధ మరోటి ఉంది. మొత్తం మీద స్త్రీగర్భసంజాతుడు కాడనే విషయాన్ని ప్రతిపాదించటానికి ఎంతగానో ప్రయత్నించారన్నది స్పష్టం.









**మరో చిత్రమైన కథ ప్రచారంలో ఉంది :** విష్ణుమూర్తి ఒకనాడు వినోదార్థియై లక్ష్మీదేవితో చతురోక్తులు పల్కుతూ చివాలున, తటాలున లేచి వెళ్లిపోయారట. ఈ వింత చర్య లక్ష్మీదేవినెంతగానో బాధించింది. భార్యను శాంతపర్చేందుకై భక్తుడొకనికి ప్రమాదం సంభవిస్తే రక్షించే ఉద్దేశ్యమనే సరికి, నాకన్నా ఆప్తులెవరని అడిగి సమాధానపడక ఆ వ్యక్తిని చూచేందుకు భూలోకానికి వచ్చి అద్భుతమైన పుష్పవనాన్ని సృష్టించిందని, ఆదారిలో పోతున్న రామానందులవారు రెండుపుష్పాలు కోసారని, వారిపై ఆమె దొంగతననేరం మోపిందని, రామానందులవారు ఆ రెండుపూలు వదలి వెళ్లిపోయేసరికి పుష్పవనం మాయమైపోయిందని, ఆమె వైకుంఠానికి వెళ్లి విష్ణువుకు ఈ విషయాలన్ని చెప్పేసరికి ఆ రామానందులవారు వదలి వేసిన ఆ పూలను చూపించగానే అందమైన బాలుడు జన్మించాడని, ఆ బిడ్డను లహర్ తారాలోని కొలనులో తామరాకు మీద పడుకోబెట్టిందని, గొప్పభక్తుడుగా వెలుగొందుతాడని దీవించినట్లుగా మహారాష్ట్ర, బెనారస్ ప్రాంతాలలో ప్రచారం ఉంది.

**ఇంకొకగాధననుసరించి :** శుకమహర్షి అనంతర జన్మలో కబీరుగా జన్మించాడని ఇది శివుని ఆదేశమని చెప్తారు. పండ్రెండు సంవత్సరాల కాలం శుకుడు గర్భవాస యాతన అనుభవించినందువల్ల అట్టి చెరను అనుభవించేందుకు ఇష్టపడక ఒక శుక్తిలో తానే ప్రవేశించి దానిని గంగానదిలో పడవేయమనగా అది లహర్‌తారా చేరి అక్కడి కొలనులో తామరాకు నంటి బద్ధలైందని అందులోంచి ఉద్భవించిన బాలుడే కబీరని మరోకధ వినిపించారు. ఇదీ మహారాష్ట్రలోనే ప్రచారంలో వుంది.

పైవాటిని మించిన అభూతకల్పనలు - ఆశ్చర్యఛకితులను చేసే కధలు మరికొన్ని ఉన్నాయి. వాస్తవానికి దగ్గరలేని అంశాలను వివరించటమెందుకు. ఇవన్నీ కబీరు నిర్యాణం చెందిన తరువాత ప్రచారంలోకి వచ్చినవి. "గడిచి పోయిన మూడు యుగాలలో పదమూడు సార్లు కబీరు అవతరించారని కలియుగంలో పధ్నాలుగోసారి అవతరించారని చెప్పారు. (1. కబీర్-పరస్‌నాథ్ తివారీ రచన ఆధారంగా) కబీరు సత్యయుగంలో శతసుక్రుడనే పేరు, త్రేతాయుగంలో మణీంద్రుడనే పేరు. ద్వాపరంలో కరుణామయుడనే పేరుతో ఉద్భవించాడని కొందరంటారు. జన్మస్థల విషయంలో లహర్‌తారా అనే దానిని కాదని అజాంగర్ జిల్లాలోని బెల్‌హరా పట్టణమన్నారు. భాషాశాస్త్రం ఆధారంగా బెల్‌హరానే - లహర్‌తారా అయిందని అన్నారు. కొందరు "మఘర్" అనే పట్టణంలో జన్మించాడనే అభిప్రాయాన్ని తెలియచేసారు.

(మరికొన్ని అంశాలను ఈ సారి చదువుకొందాము)

సమర్పణ **డా॥ సాయినాథుని సాయివరప్రసాదరావు,**
రీడరు - రేపల్లె





# "మహనీయుల - మహితోక్తులు"

## గురుస్థానమాశించకు - కోరి ఆపద చెందకు

ఇంద్రయాణినది మహారాష్ట్రంలో పూనాకు చేరువుగా ప్రవహిస్తుంది. ఆ ప్రాంతవాసులైన కనకాబాయి, బల్హోబా అనే పుణ్యదంపతులకు "దేహు" అనే గ్రామంలో **తుకారాం** జన్మించాడు. భాగవతోత్తములు నివసించే ప్రతికాలంలోను బూటకభక్తులు, "గురుమన్యులు" మనకు దర్శనమిస్తారు. వీళ్లుఅతిగా శిష్యసేకరణగావించి, తాము మహిమగల్గిన వారమని, అతీంద్రియ శక్తులున్నవారమని ప్రచారం సాగించుతూ ఆస్తులను పెంచుకుంటారు. కోటానుకోట్ల రూపాయలకు అధిపతులౌతారు. కడుపునింపుకోవటానికై పంచన చేరిన కాందిశీకులు వీరిని ఎక్కువగా ప్రచారం చేస్తారు. మంచినోటు చెలామణి అవుతున్న సమయాల్లో దొంగనోటు ఎలా కొనసాగుతుంటుందో ఇటువంటి వారి బ్రతుకు ఇంతేమరి.

అలాంటివారే ముంబాజీ, సలోమాలో అనేవారు. "తుకారం"కు వారిరువురు సమకాలీకులు. పరమభాగవతోత్తముడైన తుకారాంని బూటక భక్తునిగా బూటకపు భక్తులైన వీరు ప్రచారం చేసారు. ముంబాజీకి, సలోమాలోకి శిష్యసముదాయముంది. చాలా సమయాల్లో తుకారాంపై అభియోగాలుచేసి నిందలకు గురిచేసారు. దొంగభక్తుడన్నారు వారి గుణాలను తుకారాంకు ఆపాదించి చదివేవారు.

"తుకారాం"- ఒకానొక సమయంలో శిష్యగణాన్ని వెంటేసుకొని బయలుదేరిన "గురుమన్యుని" చూచి "గురుశిష్యణ హెతో అధమలక్షణ, భూతీనారాయణఖిరా ఆప్తైసాచి దూసరా
మేఘవృష్టియే కరవాఉపదేశ్, పరిగురునే నకరావాశిష్య .... సహతే ఉత్తమా!

గురువనే స్థానమాక్రమించి శిష్యసముదాయాన్ని చేరదీసి నశించకు. అట్టి భావన నిన్ను ఆధ్యాత్మిక స్థాయి నుండి పడిపోయేలా చేస్తుంది. భగవంతుడంతర్యామియై సర్వుల హృదయాలలో నుండగా నీవా గురుపదవిని పొందాలని తహతహలాడకు. "గురువని" అహంకారభావనతో మెలిగేవారు తప్పక ప్రమాదం పాలు చెందుతారు. అందరిలోను భగవానుని దర్శించి తరించు.

ఈ విషయంలో కబీరు మహాశయుని భావన గమనించగలరు.

"వందలాది మందమతులను వెంటేసుకోకు, సంఖ్యాబలమా! తరగని సంపదని తలచకు. వేయి గుల్లరాళ్లు జాతిరాయికి సరిగావు, ప్రచారాలకై ప్రాకులాడబోకు, అతిసంపాదన అందులో దూరనీకు"

గురువుల పేరుతో, దైవం పేరుతో, సంస్థల పేరుతో జరిగే అవకతవకలను తూర్పార పట్టారని సంబరపడేకంటే ఆధ్యాత్మిక ప్రగతిపథంలో పయనించాలని తహతహలాడేవారి నడకకు ఇదో వేగనిరోధము వంటిదని (స్పీడ్ బ్రేకర్) గ్రహించితే కొంతైనా మేలు జరుగుతుంది. ఇది హెచ్చరిక అనుకున్నా ఫర్వాలేదు / సూచనని సరిపెట్టుకున్నా ఫర్వాలేదు.

భక్తితో సమర్పణ
**"గురుచరణ దాసుడు"**